ధూపదీప నైవేద్యాల పంపిణీ

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ఆలయాలు నిత్య దీపంతో వెలగాలనే ఉద్దేశంతో ఏపీలోని కర్నూల్ జిల్లా నంద్యాలకు చెందిన ధానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్యాలు సమకూరుస్తున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు ఏకే నాగమల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సమకూర్చిన దీపధూప నైవేద్యాలను ఆమనగల్లులో ఆదివారం పంపిణీ చేశారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము ఆధ్యాత్మిక వేత్తలతో కలిసి పట్టణంలోని పలు దేవాలయాలకు వాటిని అందజేశారు. దేవాదాయ శాఖ పరిధిలోకి రాని ఆలయాల్లో నిత్యం దీపారాధన జరగాలన్న ధానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సంకల్పం అభినందనీయమని రాము పేర్కొన్నారు. శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, రమేశ్ పాల్గొన్నారు.



షాద్‌నగర్ మెయిన్‌రోడ్డుపై పూల విక్రయాలు



వెలుగుల సంబురం

దీపాల కాంతుల్లో మెరుస్తున్న లోగిళ్లు

పూల అలంకరణలో ముస్తాబైన ఇళ్లు

లక్ష్మీపూజ, నోములు, వ్రతాలకు సర్వం సిద్ధం

బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు

దీపావళి పర్వదినాన తెలుగింటి లోగిళ్లు కళకళలాడుతున్నాయి. దివ్వెల అలంకరణతో ఇళ్లన్నీ మిరుమిట్లుగొలుపుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటూ చూసినా రంగురంగుల పూల తోరణాలు దర్శనమిస్తున్నాయి. బంధుమిత్రులతో పల్లెలు, పట్నం అనే తేడా లేకుండా నిండుగా కనిపిస్తున్నాయి. సోమవారం, మంగళవారం లక్ష్మీపూజ, వ్రతాలు, నోములు నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. పండుగను సంబురంగా జరుపుకునేందుకు భారీగా టపాసుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే క్రాకర్స్ మెరుపులు, బాంబుల మోతలు వినిపిస్తున్నాయి. కాగా, కొనుగోలుదారులతో ఆదివారం మార్కెట్లు, దుకాణసముదాయాలు కిక్కిరిసాయి. మహిళలు పూలు, ప్రమిదల, పూజా సామగ్రిని పెద్ద మొత్తంలో కొనుగోలు చేశారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివాసముండే వారంతా పిల్లాపాపలతో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 19



శంకర్‌పల్లిలో టపాసుల విక్రయాలు



















పేదల ఆరోగ్య భద్రతే 'ఐక్యత' లక్ష్యం

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్య భద్రతే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో హెల్త్ శిబిరాల ద్వారా లక్ష మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించి శిబిరాలు ప్రారంభించినట్లు తెలిపారు. కడ్తాల మండలం చల్లంపల్లిలో ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ నరేందర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సురేందర్‌రెడ్డి తోకలిసి రాఘవేందర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి ఆర్గానిక్ వైద్య కిట్లను అందించారు.



పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండల పరిధి మల్కారం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు పురోహితులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ కొత్త నిబంధనలు

- కపాస్ కిసాన్ యాప్ ద్వారా రిజిస్టరైన రైతుల నుంచే పత్తి సేకరణ
- మద్దతు ధర రూ.8,110
- తేమ శాతాన్ని బట్టి రేటు వర్తింపు
- రంగారెడ్డి జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

షాద్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొత్త నిబంధనలు పెట్టింది. పత్తి అమ్మేందుకు ముందుగా 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా తమ మొబైల్ నంబర్‌ను రిజిస్టర్ చేసుకున్న రైతుల నుంచే పత్తి కొంటామని, ఈ యాప్‌ను వ్యవసాయ శాఖకు అనుసంధానం చేశామని పేర్కొంది. రిజిస్టరైన రైతులకు ఓటీపీ వస్తుందని, దాని ప్రకారమే రైతుల నుంచి పత్తి కొంటామని స్పష్టం చేసింది. పత్తి కొనుగోలుకు సంబంధించి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

రంగారెడ్డి జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలు

పత్తి కొనుగోళ్లకు రంగారెడ్డి జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉష తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో 9, ఆమనగల్లు మండలంలో 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇందుకు పత్తి పండించిన ప్రతి రైతు కంపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని ఆమె సూచించారు. స్లాట్ బుక్ సమయంలో రైతులు జిల్లా, మార్కెట్,



పత్తి విక్రయించే సెంటర్, పత్తి రకం, అమ్మదల్చుకున్న సమయం వంటి వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

తేమ శాతాన్ని బట్టి ధర

పత్తిలో తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర ఉంటుంది. పత్తిలో తేమ శాతం 8 లోపు ఉంటే క్వింటాలుకు రూ.8,110 చెల్లిస్తారని పేర్కొన్నారు. 9శాతానికి మించి తేముంటే మద్దతు ధరలో ఒక శాతం తగ్గించి రూ.8,028, 10శాతం తేమ ఉంటే ధరలో 2శాతం తగ్గించి క్వింటాలుకు రూ.7,947, తేమ శాతం 11దాటితే ధరలో 3 శాతం తగ్గించి రూ.7,866, 12శాతం తేమ ఉంటే క్వింటాలుకు 7,785 చొప్పున ధర చెల్లిస్తామని ప్రకటించారు. పత్తిలో 12శాతానికి మించి తేమ ఉంటే సీసీఐ కొనదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పత్తి రైతులు గుర్తుంచుకోవాలని, బాగా ఎండబోసి తేమ ఎక్కువగా లేకుండా చూసుకొని చెత్తలేకుండా చూసుకోవాలని, ఆధార్ నంబర్‌తో లింకైన బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని అధికారి వివరించారు.

కొనుగోలు కేంద్రాలు ఇలా

షాద్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్-చిలుకమర్రి, దోడియా ఆగ్రో ఇండస్ట్రీస్-చిలుకమర్రి, గౌరవ ఇండస్ట్రీస్ సోలిపూర్, తిరుమల ట్రేడింగ్ కంపెనీ-నందిగామ, హరిహర జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్-నందిగామ, తుల్జా భవానీ కాటెక్స్-నందిగామ, శ్యాం కాటెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్-నందిగామ, శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్-వనంపల్లి(చౌదరిగూడ మండలం), సూపర్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్-వనంపల్లిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మండల పరిధి ఎస్వీటీ కాటన్ ఇండస్ట్రీస్-ఆకుతోటపల్లి, శ్రీ అభిశేక కాటన్ మిల్స్-పోలెపల్లి, శ్రీనివాస్ మురుగన్ ఇండస్ట్రీస్-తలకొండపల్లిలో ఏర్పాటు చేశామని వివరించారు.

సొంత డబ్బుతో కంపచెట్ల తొలగింపు

యాచారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తాటిపర్తి-నానక్‌నగర్ మధ్య రోడ్డును ఆక్రమించిన ముళ్లకంపచెట్లను ఆదివారం నానక్‌నగర్ గ్రామానికి చెందిన సీపీఎం కార్యకర్తలు సొంత డబ్బుతో తొలగించారు. మూడు కిలోమీటర్ల దూరం వరకు రోడ్డును ముళ్లకంప చెట్లన్నీ ఆక్రమించాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నానక్‌నగర్ మాజీ సర్పంచ్ పెద్దయ్య నాయకులు బర్ల మల్లేష్ తదితరులు జేసీబీతో చెట్లను తొలగించి గోతులు పూడ్చారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

శంకర్‌పల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శంకర్‌పల్లిలో స్వయం సేవకులు పథ సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో పాటుగా వివిధ గ్రామాలకు చెందిన స్వయం సేవకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. డీఎమ్మార్ గార్డెన్ నుంచి ప్రారంభమై పట్టణంలోని వీధులవెంట సాగింది. డీఎస్ఆర్ గార్డెన్‌లో దక్షిణమధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమరలింగన్న స్వయం సేవకులను ఉద్దేశించి ప్రసంగించారు.

గ్రామాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం

కొందుర్గు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీ డీకేఅరుణ మంజూరుచేసిన నిధులతో ఏర్పాటుచేసిన ఐమ్యాక్స్ లైట్లను ప్రారంభించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి వంశీకృష్ణ, మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, శంకర్, తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ నేతల ఏకాభిప్రాయం

ఆమనగల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవి విషయంలో కల్వకుర్తి కాంగ్రెస్‌న నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. హైదరాబాద్ బాలాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రూస్ ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల నుంచి డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అంజయ్య, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమానాయక్ హాజరయ్యారు. తమకు అవకాశం కల్పించకపోతే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌కు చాన్స్ ఇవ్వాలని కోరారు. కాగా ఆమనగల్లు బ్లాక్ పరిధిలోని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా ఏకాభిప్రాయం తెలిపినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ తెలిపారు.



రాబర్ట్ బ్రూస్‌తో డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు

పారదర్శకంగా డీసీసీ అధ్యక్ష ఎన్నిక

డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కాంగ్రెస్ పార్టీ పారదర్శకంగా చేపడుతుందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఏఐసీసీ ఆదేశానుసారం పరిశీలకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు అధ్యక్షుడి ఎన్నికకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రూస్, టీయుఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డిని ఆదివారం శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ్మాలు మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీసీ అధ్యక్షుడిగా కల్వకుర్తికి చెందినవారికి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు.

జాబితా అందజేత

డీసీసీ అధ్యక్షుడి నియామకానికి కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించి ఆశావహుల జాబితాను ఆదివారం ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్‌కు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అందజేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, పార్టీ మండలాల అధ్యక్షులు జగన్, బీచ్యానాయక్, కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చేవెళ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. వికారాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన మహ్మద్ యూసఫ్ కుమారుడు జహంగీర్(26) చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మొహ్మద్ జహంగీర్ వద్ద బొలెరో వాహనంపై క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 18న సాయంత్రం బస్తేపూర్‌లో కొత్తిమీర తీసుకురావడానికి డ్రైవర్ జహంగీర్, క్లీనర్ జహంగీర్‌లు బస్తేపూర్‌కు వెళ్లారు. కొత్తిమీరను బాక్స్‌లను వాహనంలో లోడ్‌చేసి కవర్ కప్పుతుండగా కరెంట్ వైర్లు క్లీనర్ జహంగీర్ చేతికి తగలడంతో షాక్‌కు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. ఆదివారం పోస్టుమార్టం చేశారు.

'రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర'

కందుకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర రాజకీయాలు చేస్తోందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ప్రభుత్వం అవకాశం కల్పించాలని భావిస్తుంటే బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. లేమూరుకు చెందిన 30మంది బీఆర్ఎస్ కార్యకర్తలు సీనియర్ నాయకులు కె.రాజాప్రతాప్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో కేఎల్లార్ సమక్షంలో తుక్కుగూడలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ వైస్‌చైర్మన్ యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాల్లో ఆదివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. అనారోగ్యంతో మృతిచెందిన చెర్యాకర్‌కు చెందిన శంకరమ్మ, గాజుల మహేశ్వరం కుటుంబాలను పరామర్శించారు. భీమయ్య, నాగులు, నర్సింహ, నిరంజన్, తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. కొండాకల్ గ్రామంలో రూ.5.30 కోట్లతో నూతనంగా నిర్మించే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, కాశీనాథ్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రానికి మౌనమెందుకు?

కొందుర్గు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం మౌనం ఎందుకు వహిస్తుందో చెప్పాలని సీఐటీయూ మండల కన్వీనర్ రాయికంటి గోపాల్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాయికంటి గోపాల్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజానికానికి ఏం చేస్తున్నాయో అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం కోసం నిలబడి చిత్తశుద్ధిని నిరూపించుకుందామన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

















బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ

చౌదరిగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని తూంపల్లి చౌరస్తాలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు ప్రతీనెల వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బాగళ్ళ నర్సింహ్మా, బాల్‌రాజ్, షబ్బీర్, వీరేశం, గోపాల్, పద్మ, అనిత పాల్గొన్నారు.



కులవృత్తుల ఆత్మగౌరవం పెంపే

ప్రభుత్వ లక్ష్యం


జంగాచారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):కులవృత్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవం పెంపే లక్ష్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు రూపొందించి అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మారోజు జంగాచారి ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకుడు వస్పుల జంగయ్యతో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగాచారిని శాలువాతో సత్కరించి అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాలలో స్వర్ణకారులు తమ వంతు పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘురాములు, వెంకట్‌రెడ్డి, శ్రీను, రూపేశ్, శ్రీనివాసాచారి, స్వర్ణకారుల సంఘం ప్రధానకార్యదర్శి మహేశ్వరం సంతోషాచారి, శివచారి పాల్గొన్నారు.







ఎయిర్‌పోర్టులో మహిళ బ్యాగు మాయం

48 గంటల్లోనే కనిపెట్టిన పోలీసులు

ప్రయాణికురాలికి అప్పగింత



శంషాబాద్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహిళా ప్రయాణికురాలు బ్యాగు మాయమైన సంఘటన ఆర్జీఐఏ ఎయిర్‌పోర్టు ఔట్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన సిత్మాహరీష్ అనే మహిళ ఈ నెల 17న దుబాయ్ నుంచి వయా శంషాబాద్ ఎయిర్‌పోర్టు టూ కేరళ వెళ్తోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ కావడంతో కొందరు ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో దిగారు. ఆ సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మహిళ బ్యాగు మిస్సైంది. దీంతో మహిళ ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఎయిర్‌పోర్టులోని సీసీ కెమెరాలను పరిశీలిం చగా బ్యాగు ఆచూకీ తెలి సింది. బ్యాగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగులో 2.5 తులాల బం గారు ఆభరణాలు, ఐఫోన్, రూ. 10 వేల నగదు, పాస్ పోర్టు, యూఏఈ ఎంప్లాయ్ ఐడీ, వీసా తదితర విలువైన పత్రాలు ఉన్నట్లు గుర్తిం చారు. సీఐ కనకయ్య బాధి తురాలికి ఫోన్‌చేసి పిలిపించి బ్యాగును అప్పగిం చారు. దాదాపు రూ. 3.50 లక్షల విలువైన వస్తువులను అప్పజెప్పారు. బ్యాగును కనిపెట్టిన హెడ్ కానిస్టేబుల్ జగన్, కానిస్టేబుల్ ఈర్షద్‌ను సీఐ అభినందించారు. విమాన ప్రయాణికులకు భద్రతే మాకు ముఖ్యమని సీఐ పేర్కొన్నారు.









బీసీ రిజర్వేషన్ సాధించే వరకు పోరాడుతాం


రిలే నిరాహార దీక్షలో నాయకులు

షాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జనాభాలో సగం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష ఆదివారం 8వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌పై పోరాడుతున్నామన్నారు. నాయకులు తమ్మలి రవీందర్, అంజయ్య, చంద్రయ్య, హరికుమార్, రాము, దర్శన్, శ్రీనివాస్, రామస్వామి, రమేష్, సాధిక్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్ఎస్ శాఖల విస్తరణతో

దేశభక్తి పెంపు


కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు

చేవెళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ గ్రామంలో ఆర్ఎస్ఎస్ శాఖలు విస్తరించి దేశభక్తి భావనను పెంపొందిస్తామని ఆర్ఎస్ఎస్ ప్రధాన వక్త అన్నదానం సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు ఆదివారం చేవెళ్లలో ఘనంగా నిర్వహించారు. రచ్చబండ నుంచి పురవీధుల మీదుగా కేవీఆర్ గ్రౌండ్ వరకు స్వయం సేవకులు కవాతు నిర్వహించారు.అనంతరం కేవీ ఆర్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కుల వ్యవస్థలతో సంబంధం లేకుండా సమానతా భావంతో ఆర్ఎస్ఎస్ ముందుకు సాగుతుందన్నారు. పవిత్ర హిందూ ధర్మం, సంస్కృతి, సమాజ రక్షణే స్పష్టం చేశారు. స్వయం సేవకులు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర ఉందన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కెఎస్. రత్నం, కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మల్లేశం, అనంతరెడ్డి, వైభవ్‌రెడ్డి ఉన్నారు.

మంచాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు తమ వ్యక్తిగత వేడుకలకు పోలీసు వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధి కాగజ్‌ఘట్ సిరి నేచర్ వ్యాలీ రిసార్టులో వెలుగులోకొచ్చింది.

వ్యక్తిగత వేడుకలకు పోలీసు వాహనాలు!

కాగజ్‌ఘట్ సిరినేచర్ వ్యాలీలో వెలుగులోకి..

విశ్వసనీయ సమాచారం మేరకు.. కాగజ్‌ఘట్ సమీపంలోని సిరి నేచర్ వ్యాలీలో 2007 బ్యాచ్‌లో ఉద్యోగానికి ఎంపికై వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు ఆదివారం వేడుకలు జరుపుకున్నారు. సుమారు 100మందికి పైగా పోలీసు అధికారులు పాల్గొన్న ఈ పార్టీలో అంతా సివిల్ డ్రెస్‌లోనే ఉన్నారు. అయితే, ఈ వేడుకలకు వచ్చే సమయంలో చాలామంది ప్రభుత్వ పోలీసు వాహనాలు వినియోగించడం వివాదాస్పదంగా మారింది. పదుల సంఖ్యలో ఇక్కడి రిసార్టులో పార్కింగ్ చేసి ఉండడం కనిపించింది. కాగా, వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వీరంతా ప్రభుత్వ వాహనాల్లో ఇక్కడికి రావడమేంటి? అసలు ఇదంతా ఎలా సాధ్యమైంది అనేది తెలియాల్సి ఉంది.


అధికారులు వినియోగించిన ప్రభుత్వ వాహనాలు

వలస కూలీ అంత్యక్రియలకు చేయూత

కందుకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపురంనకు చెందిన షాబొద్దీన్(36) పది సంవత్సరాల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి కోసం మండల కేంద్రానికి వలస వచ్చాడు. అతడికి భార్య, నలుగురు కుమారులు. మేస్త్రీ వద్ద ప్రతీ రోజు కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన షాబొద్దీన్ అంత్యక్రియలు మండలంలోని మహ్మద్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మేస్త్రీలు, మిల్లర్ యజమానులు కలిసి మృతుడి భార్యకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు.

యువత ఐక్యతకు క్రీడలు దోహదం

యాచారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడలు యువతలో ఐక్యతను పెంపొందించడంతో శారీరక ధారుడ్యాన్ని పెంచడానికి దోహదపడుతాయని బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అన్నారు. నాలుగు రోజులుగా యాచారం మండలంలోని మల్కీజ్‌గూడలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. శనివారం రాత్రి విజేతలకు బహుమతులందించారు.

పాల నాణ్యతను పెంచాలి

కడ్తాల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయ పాల ఉత్పత్తిదారులు పాల నాణ్యతను పెంచి సంస్థను కాపాడుకోవాలని కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ ప్రాణేశ్‌కుమార్, పాలసేకరణ కేంద్రం అధ్యక్షుడు వెంకటేశ్‌లు అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం వద్ద ఆదివారం దీపావళి నేపథ్యంలో 120మంది రైతులకు పాల ఉత్పత్తిదారులకు పాల బకెట్లు, స్వీట్‌బాక్స్‌లు పంపిణీ చేశారు.

శబరిమలకు పాదయాత్ర

షాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొమరబండలో ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్ర చేస్తున్న స్వాములు క్షేమంగా స్వామి సన్నిధికి చేరుకోవాలని ఆకాంక్షించారు.